డ్రెయిన్లపై నిర్లక్ష్యం వల్లే వరి పొలాల ముంపు

● జిల్లాలో నీట మునిగిన 18 వేల ఎకరాలు
● నీటిపారుదల మంత్రి జిల్లాలో ఉన్నా రైతులకు తప్పని కష్టాలు


ముంపునకు గురైన వరి పొలాలు


వరినాట్లు వేయకపోవడంతో పొలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు

భీమవరం: పంట భూములను ముంపుబారి నుంచి ప్రభుత్వం కాపాడలేకపోవడంతో జిల్లాలో వేలాది ఎకరాలు బీడు భూములుగా మారాయి. జిల్లాలోని 20 మండలాల పరిధిలో ముంపు కారణంగా దాదాపు 18 వేల ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగాయి. అన్నదాతలను ఆదుకుంటామంటూ ఎన్నికల్లో హామీలిచ్చి అందలమెక్కిన కూటమి సర్కారు పంట భూములు ముంపు బారిన పడకుండా కనీస చర్యలు తీసుకోకపోవడంతో నాట్లు వేయలేకపోయామని, రైతులకు ఎటువంటి సహాయం అందలేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయమే జీవానాధారమైన జిల్లాలో సార్వా సీజన్‌లో సుమారు 2.19 లక్షల ఎకరాల్లో సాగు చేపట్టాల్సి ఉంది. అయితే సాగు ప్రారంభంలోనే అధిక వర్షాలు, వరదల కారణంగా నారుమళ్లు, ముందుగా వేసిన నాట్లు ముంపు బారిన పడ్డాయి. రైతులు తిరిగి నారుమళ్లు, నాట్లు వేసుకోడానికి పెద్ద మొత్తంలో ఖర్చు చేయగా ఆగస్టులో వర్షాలు, వరదల వల్ల నాట్లు నీట మునిగి రైతులను కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి.

నీటిపారుదల మంత్రి జిల్లా వాసే అయినా

గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా పని చేసిన రోజుల్లో అనావృష్టి కారణంగా పంట పొలాలకు సాగునీరు సక్రమంగా అందక వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. అప్పట్లో ఒక్క ఎకరం కూడా ఎండనివ్వమంటూ చెప్పినా సాగు నీరు అందించడంలో ఘోరంగా విఫలమయ్యారు. ప్రస్తుతం నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారం చేపట్టిన వెంటనే మురుగునీటి పారుదలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తక్షణం డ్రైనేజీ వ్యవస్థకు మోక్షం కల్పిస్తామంటూ గొప్పగా చెప్పారు. అయితే తూతూ మంత్రంగా కొన్ని చోట్ల మురుగు కాలువల్లో గుర్రపు డెక్క, తూడు తొలగించడం మినహా డ్రెయిన్ల పక్షాళనపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో జిల్లాలో ప్రధానంగా భీమవరం, కాళ్ల, ఆకివీడు, పాలకొల్లు, అత్తిలి, పెనుమంట్ర, తణుకు తదితర మండలాల్లో వేలాది ఎకరాలు నీటిలోనే ఉండిపోవడంతో నాట్లు వేయలేకపోయినట్లు రైతులు చెబుతున్నారు. భీమవరం మండలంలో దాదాపు 2,500 ఎకరాలు, కాళ్ల మండలంలో 800 ఎకరాలకు పైగా నాట్లు వేయలేని పరిస్థితి నెలకొంది. జిల్లా మొత్తంగా 122 గ్రామాల్లో సుమారు 9 వేల ఎకరాల్లో పంట నష్టపోయినట్లు అధికారిక అంచనాలు చెబుతున్నా పంట నష్టం మరింత ఎక్కువగా ఉంటుందని రైతులకు అండగా ఉంటామంటూ చెప్పిన కూటమి నాయకులు ఇప్పటి వరకు పంట దెబ్బతిన్న రైతులకు ఎటువంటి సహాయం అందించలేదని రైతులు వాపోతున్నారు. వరదల కారణంగా రెండు, మూడు పర్యాయాలు నాట్లు వేసిన రైతులకు పెట్టుబడులు పెరగడం తప్ప దిగుబడులు పెద్దగా ఉండవని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డ్రెయిన్ల పక్షాళన చేపట్టకుంటే రానున్న రోజుల్లో పెద్ద మొత్తంలో భూములు బీడుగా మారే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

క్షత్రియ ఆశ్రమాల నిర్వహణ కమిటీ సభ్యుడిగా వర్మ


భూపతిరాజు సత్యనారాయణవర్మ

భీమవరం: క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీశైలం, భద్రాచలం, షిర్డీ, కాశీలలో నిర్వహిస్తున్న క్షత్రియ ఆశ్రమాల నిర్వహణ కమిటీ సభ్యుడిగా పాలకోడేరు మండలం కుముదవల్లి గ్రామానికి చెందిన భూపతిరాజు సత్యనారాయణ వర్మ ఎంపికయ్యారు. గతంలో పాలకోడేరు సహకార సంఘం అధ్యక్షుడిగా పని చేసిన వర్మ నూతనంగా క్షత్రియ సేవా సంఘం ఆశ్రమాల నిర్వహణ కమిటీ సభ్యుడిగా ఎన్నిక కావడంతో పలువురు అభినందించారు.

ఎస్‌టూఎస్ కిట్ల పంపిణీకి సిద్ధం


పంపిణీకి సిద్ధం చేసిన ఎస్‌టూఎస్ కిట్లు

వీరవాసరం: ప్రకృతి వ్యవసాయం సాగు చేయడానికి అవసరమైన ఎస్‌టూఎస్ కిట్లు అందుబాటులో ఉంచామని మండల ఇన్‌చార్జి రవి సోమవారం విలేకరులకు తెలిపారు. 2 లీటర్ల అగ్నస్త్రం, 250 మిల్లీ లీటర్ల కోడిగుడ్డు నిమ్మరసం, 4 బాటిల్స్ బయోకల్చర్, 4 కిలోల వేప పిండి, 8 లింగాకర్షక బుట్టలు, 6 ఎల్లో ప్లేట్లు, పావు కిలో పాల ఇంగువ, ద్రవ జీవామృతం తయారు చేయడానికి సంచితో కలిపి 150 కిట్లు సిద్ధం చేశామన్నారు. ఒక్కొక్క కిట్టు రూ.300 విలువ ఉంటుందన్నారు. కిట్ల తయారీలో దుర్గారావు, వినోద్‌కుమార్, వీరేంద్ర, శ్రీనివాస రావు, సతీష్‌కుమార్, మురళికుమార్, వెంకట వరలక్ష్మి, సర్వేశ్వరరావు, అంబేడ్కర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల కాటాల తనిఖీ


రేషన్ డీలర్ల కాటాలకు సీల్ వేస్తున్న దృశ్యం

పాలకోడేరు: రేషన్ డీలర్లు కాటాలను ఎప్పటికప్పుడు సరిచూసుకుంటూ ఉండాలని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ టీ.రాంబాబు పేర్కొన్నారు. సోమవారం పాలకోడేరు మండలంలోని రేషన్ డీలర్ల కాటాలను తనిఖీ చేసి సీళ్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటాలకు సమయం ప్రకారం సీళ్లు వేయించుకోకపోయినా, రసీదు షాపు పరిధిలో ప్రదర్శించకపోయినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీళ్లు వేసే కార్యక్రమంలో వీరమల్లు బ్రహ్మాజీ, అమ్మారావు, మండల డిప్యూటీ తహసీల్దార్ ఆదిశేషయ్య, డీలర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడు దొంగ కృష్ణ, ప్రధాన కార్యదర్శి సాయి కృష్ణ, కొల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్షీరా రామలింగేశ్వర ఆలయ ఈవోగా ముచ్చర్ల


ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ కార్య నిర్వహణాధికారిగా ముచ్చర్ల శ్రీనివాస రావు పూర్తి బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఉత్తర్వులు వచ్చినట్లు శ్రీనివాస రావు తెలిపారు. ఇప్పటి వరకు ఇంచార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న తనకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్, విజయవాడ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

నరసాపురం: అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ అధికారులకు సూచించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్‌కు ఫిర్యాదులు, దరఖాస్తులు అందించారు. మొత్తం 52 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీవో చెప్పారు. గత మూడు వారాలుగా కార్యక్రమం జరగకపోవడంతో పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందించారు. భూ సర్వేలు, రేషన్‌కార్డులు, మంచినీటి సమస్యలపై పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదవాలి

పాలకొల్లు అర్బన్: ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఆర్డీవో అంబరీష్ అన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఛాంబర్స్ ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వహిస్తున్న కంచర్ల వీర్రాజు మెమోరియల్ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు, అలాగే బీఆర్‌ఆర్ అండ్ జీకేఆర్ ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో పెరల్ జూబ్లీ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ తటవర్తి కృష్ణమూర్తి, అడిషనల్ చైర్మన్ కలిదిండి రామరాజు, కోశాధికారి రేపాక ప్రవీణ్‌భాను, చీఫ్ డోనర్లు భూపతిరాజు విశ్వనాథరాజు, కంచర్ల రాజేష్ పాల్గొన్నారు.

‘మీకోసం’కు 2 ఫిర్యాదులు

ఆకివీడు: మీకోసం కార్యక్రమానికి రెండు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ కె.వాణి సోమవారం తెలిపారు. స్థానిక 10వ వార్డులోని శారదా కాన్వెంట్ వీధిలో కుళాయిల ద్వారా మురుగునీరు వస్తుందని ఆ ప్రాంతానికి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు కె.రామలింగరాజు ఫిర్యాదు చేశారు. స్థానిక స్టార్ ఆఫ్ హోప్ ఆసుపత్రి ముందు ఆక్రమణల్ని తొలగించాలని, జాతీయరహదారికి చేర్చి ఉన్న ఆక్రమణల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆసుపత్రి ప్రతినిధి డేవిడ్ లివింగ్ స్టన్ ఫిర్యాదు చేశారు.

వ్యక్తికి గాయాలు

నరసాపురం: పట్టణంలోని మూడు బొమ్మలు సెంటర్ ప్రాంతానికి చెందిన ఉంగరాల సత్యనారాయణ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడినట్లు ఎస్సై జయలక్ష్మి చెప్పారు. ఆదివారం రాత్రి సత్యనారాయణ మొగల్తూరు రోడ్డులో ఆంజనేయస్వామి గుడి వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఆటో ఢీ కొట్టింది. దీంతో గాయపడ్డ సత్యనారాయణను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. సత్యనారాయణ కుమారుడు మాధవ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఆటో నెంబర్ ఆధారంగా డ్రైవర్ ఆచూకీ కోసం గాలిస్తున్నామని తెలిపారు.

వరద బాధితులకు విరాళం


కలెక్టర్ నాగరాణికి విరాళం అందజేస్తున్న విద్యార్థులు


విజయవాడ వరద బాధితులకు సమకూర్చిన నిత్యావసర సరుకులు

వీరవాసరం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి సేకరించిన రూ.3,04,160 సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఇచ్చారని మండల విద్యాశాఖాధికారి ఎం.శ్రీమన్నారాయణ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులతో జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణికి అందజేశామన్నారు. ఫండ్ సేకరణ చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎంఎన్ శ్రీమన్నారాయణ, కానుకొలను శ్రీనివాసరావు, మండా రామకృష్ణ, జుత్తిగ శ్రీనివాస్, ఎ.భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

భీమవరం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం భీమవరం శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులు నిత్యావసరాలు సోమవారం పంపించారు. వరద ముంపునకు గురైన వారిని ఆదుకోవాలని విద్యార్థులు సేకరించిన బియ్యం, కందిపప్పు, చింతపండు, మంచి నూనె, ఉల్లిపాయలు వంటి వాటిని కళాశాల వాహనంలోనే తరలించారు. చిన్న పిల్లలకు బిస్కెట్స్, రస్కులు, మిల్క్ పౌడర్‌ను పంపిణీ చేయనున్నట్లు కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఎ.అనురాధ తెలిపారు.

విద్యార్థులు, ఉపాధ్యాయుల విరాళం

భీమవరం(ప్రకాశం చౌక్): విజయవాడ వరద బాధితులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు విరాళాలు కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా అందించారు. గొల్లలకోడేరుకు చెందిన వయో వృద్ధురాలు దాట్ల పరి పూర్ణావతి రూ.10 వేలు, కాళ్ళ మండలం మాలవానితిప్ప జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ.25,825, ఆచంట మండలం భీమలాపురం జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు రూ.13,500, భీమవరం మండలం చినఅమిరం జెడ్పీ స్కూల్ ఉపాధ్యాయులు రూ.10 వేలు చొప్పున విరాళం అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో జె.ఉదయ భాస్కరరావు, డీఈవో జి.నాగమణి, పి.శ్రీనివాసరాజు, సీహెచ్ ప్రసాదరావు, పచ్చమట్ల సునీత, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీ బిడ్డకు ఆరోగ్యం


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో లక్ష్మీకాంతం

భీమవరం అర్బన్: గర్భిణులు ఐసీడీఎస్ సేవలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలని భీమవరం ఐసీడీఎస్ సీడీపీవో టీకేవీ లక్ష్మీకాంతం అన్నారు. భీమవరంలోని రాయలంలోని అంగన్‌వాడీ కేంద్ర కార్యాలయంలో పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా సోమవారం బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించి, గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా భీమవరం ఐసీడీఎస్ సీడీపీవో టీకేవీ లక్ష్మీకాంతం మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచి ప్రతీ ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆకు కూరలు, కూరగాయాలు, పప్పు దినుసులు గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ డి.అనిల్‌కుమారి, అంగన్‌వాడీ టీచర్లు సీహెచ్ మహాలక్ష్మి, మణెమ్మ, జి.దమయంతి, ఏఎన్ఎం ప్రియదర్శిని, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా నిరసన


లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా నిరసన చేస్తున్న సీఐటీయూ నాయకులు

భీమవరం: లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ భీమవరం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్, ఏఐటీయూసీ నాయకుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ కార్మికులు తమ పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్పు చేసి, కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా తమ సొంత ఎజెండాతో కేంద్ర ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్, గోపాలకృష్ణంరాజు, వరలక్ష్మి, పెద్ద కనకరాజు, రాంబాబు, కలిశెట్టి శ్రీనివాస్, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి మృతి తీరని లోటు


ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం అర్బన్: అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి లేకపోవడం కమ్యూనిస్టులకు, లౌకిక ప్రజా స్వామ్యవాదులకు, ప్రజానీకానికి తీరని లోటని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని దెయ్యాలతిప్ప గ్రామంలో సోమవారం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఆర్‌ఎస్‌ల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశలోనే ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. ఆయన మరణం కమ్యూనిస్టులకు, లౌకిక ప్రజాస్వామ్య వాదులకు, ప్రజలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో వాటాల పెద్దిరాజు, బొమ్మిడి నాగరాజు, పొన్నబత్తుల గోపాలకృష్ణ, బొమ్మిడి ధర్మారావు, బత్తుల ప్రభుదాసు, తిరుమాని నరసింహస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జ్ఞానేశ్వర్ ఎంపిక


బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన జ్ఞానేశ్వర్‌ను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: జూనియర్ బాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్‌లో భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి టి.జ్ఞానేశ్వర్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. ఈ నెల 22న ఏలూరు జిల్లా నూజివీడు ఎంఆర్ అప్పారావు పీజీ సెంటర్‌లో నిర్వహించిన బాల్ బాడ్మింటన్ సెలక్షన్స్‌లో ఎంపికై నట్లు తెలిపారు. జ్ఞానేశ్వర్ అక్టోబర్ 5 నుంచి మూడు రోజులు విశాఖ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటాడన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ మంగం వేణు, వైస్ ప్రిన్సిపల్ ఎం.శ్రీలక్ష్మి, పీడీ శ్రీనివాసరావు అభినందించారు.

భారీ వర్షంతో రోడ్లు జలమయం


కాళ్ల సినిమా హాల్ సెంటర్‌లో రాష్ట్రీయ రహదారిపై నిలిచిన వర్షపునీరు

కాళ్ల: కాళ్ల మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి రహదారులపై మోకాళ్లలోతు పైనే వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధానంగా కాళ్ల గ్రామంలో సినిమా హాల్ సెంటర్ శివాలయం వద్ద రాష్ట్రీయ రహదారి చెరువులను తలపించే విధంగా వర్షపు నీరు నిలిచిపోయింది. అసలే అధ్వానంగా ఉన్న కోలనపల్లి – ఆకివీడు రహదారి వర్షంతో అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలో ఆయా గ్రామాల్లో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. గ్రామాల్లో వర్షపు నీరు నిలవలేకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై రివ్యూ పిటిషన్

నరసాపురం: సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ నరసాపురం పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, మాలల న్యాయ పోరాట సమితి నరసాపురం నియోజక వర్గ అధ్యక్షుడు సోడదాసి శ్రీధర్ రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సోమవారం శ్రీధర్ పట్టణంలో తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ సుప్రీంకోర్టు న్యాయవాది భరత్ మనుబర్వాల ద్వారా ఈ పిటీషన్ సుప్రీంకోర్టులో దాఖలు చేశామని చెప్పారు. మాలల హక్కులకు న్యాయం జరిగే వరకూ న్యాయ పోరాటం సాగిస్తామని చెప్పారు. సమావేశంలో సంఘ నేతలు మట్టా సుధీర్‌మోహన్, వర్ధనపు ఏసురత్నం, మేడిది శ్రీమంత్, సోడదాసి రత్నరాజు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న జ్వరాలు

● ఫాగింగ్, బ్లీచింగ్ చర్యలు శూన్యం
● మొక్కుబడిగా స్వచ్ఛతా హీ
● జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు


జ్వరంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు (ఫైల్)

ఆకివీడు: స్వచ్ఛతా హీ కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. గ్రామాలు, పట్టణాల శుభ్రత కోసం కేంద్రం అమలు చేస్తున్న ఈ కార్యక్రమం నిర్వహణలో చిత్తశుద్ధి లోపించింది. దీంతో గ్రామాల్లో ఎక్కడికక్కడ అపరిశుభ్రత వాతావరణం దర్శనమిస్తోంది. దీని ఫలితంగా దోమలు పెరిగిపోయి జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామాల్లోనూ, మండల కేంద్రాల్లోనూ, నగర పంచాయతీ పరిధిలో గత రెండు నెలల నుంచి వైరల్ ఫీవర్లతో ప్రజలు మంచాన పడ్డారు. జ్వరాలు తగ్గుతున్నా ఇతర సైడెఫెక్ట్‌తో తల్లడిల్లిపోతున్నారు. జ్వరం వచ్చిన వ్యాధిగ్రస్తుడు రెండు నెలల వరకూ కోలుకోవడం లేదంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో వైద్యులకు, బాధితులకే తెలియాలి. వైరల్ ఫీవర్లతో చిన్నారులు సైతం ఆసుపత్రుల పాలవుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లినా సరైన వైద్యం అందకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

చికెన్ గున్యా వచ్చినా...

దుంపగడప గ్రామంలో ఇద్దరికి చికెన్ గున్యా వ్యాధి సోకినట్లు ప్రభుత్వ ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న రోగులకు చికిత్స చేసినా ఫలితం లేకపోవడంతో 10 మంది రోగుల రక్త నమూనాల్ని సేకరించి ల్యాబ్‌కు పంపారు. వారిలో ఇద్దరికి చికెన్ గున్యా అని తేలింది. ఈ గ్రామంలో నేటికీ కీళ్ల వాపులు, కాళ్ల వాపులు, ముక్కు, ముఖం రంగుమారిపోవడం, ఒళ్లనొప్పులతో బాధపడుతున్నవారి సంఖ్య ఎక్కువగానే ఉన్నా ఆ దిశగా వైద్యం అందించిన దాఖలాలు లేవని ప్రజలు వాపోతున్నారు. ఈడిస్ (టైగర్) దోమ కుట్టడం వల్ల చికెన్ గున్యా, డెంగీ వైరస్ సోకుతుందంటున్నారు. చాలా మందికి రక్తం ప్లేట్లెట్స్ పడిపోతున్నాయి. సరైన వైద్యం సకాలంలో అందడంతో బ్రతికి బట్టకడుతున్నామని చెబుతున్నారు. టైఫాయిడ్ జ్వరం కూడా విజృంభిస్తుందని చెబుతున్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు శూన్యం

దోమల నిర్మూలనకు పంచాయతీలు, నగర పంచాయతీ ఫాగింగ్ చేయడంలో పూర్తిగా విఫలమయ్యాని ప్రజలు వాపోతున్నారు. పలు గ్రామాల్లో దోమల మందు పిచకారీ చేసిన దాఖలాలే లేవంటున్నారు. అధిక పాళ్ల సున్నంలో కొద్దిపాటి బ్లీచింగ్ కలిపి చల్లడం వల్ల ఉపయోగం ఉండటంలేదని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పంచాయతీల్లో బస్తాలకు బస్తాలు బ్లీచింగ్ ఖాళీ అయిపోతుందని రికార్డులు చూపిస్తున్నాయంటున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి ఆయా గ్రామ పంచాచాయతీలు, నగర పంచాయతీలో ప్రతీ రోజూ ఫాగింగ్ చేయించి దోమల నిర్మూలన చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. స్వచ్ఛతా హీ కార్యక్రమం విజయవంతం కావాలంటే దోమల నిర్మూలన తప్పనిసరి అని అధికారులు గ్రహించాలని అంటున్నారు.

దళిత నాయకుల హౌస్ అరెస్ట్


దళిత నాయకులను హౌస్ అరెస్ట్ చేసిన దృశ్యం

కాళ్ల: మండలంలోని ఏలూరుపాడు గ్రామంలో దళిత నాయకులను సోమవారం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. గ్రామంలో అంబేడ్కర్ ఫ్లెక్సీ తొలగించిన ఘటనకు సంబంధించి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ మోటార్‌సైకిళ్లపై ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వాలని దళిత నాయకులు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా గ్రామంలో దళిత నాయకులు కోన జోసెఫ్, కోన రంజిత్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు


పారిశుద్ధ్య కార్మికులకు వైద్య సేవలందిస్తున్న దృశ్యం

ఆకివీడు: స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక సీహెచ్‌సీలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని నగర పంచాయతీ కమిషనర్ జీ.కృష్ణ మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రతకు నిరంతరం కృషి చేసే పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉండేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. సీహెచ్‌సీ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ గణేశ్వర రావు, కూటమి నాయకులు, వైద్యులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.50 వేల విరాళం


దేవస్థానం ఈఓకి చెక్కు అందిస్తున్న దాతలు

కాళ్ల: కాళ్ల మండలం కాళ్ళకూరు గ్రామంలో వేంచేసి ఉన్న స్వయంభూ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నదాన భవన నిర్మాణానికి భీమవరానికి చెందిన మేడిశెట్టి సాయిప్రణీత్ కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళం అందించినట్లు దేవస్థానం ఈవో మోకా అరుణ్ కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి ప్రతిమతో సత్కరించారు.

జిల్లా జట్లకు విద్యార్థుల ఎంపిక

పెనుగొండ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అండర్–19 విభాగంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్లకు పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కొల్లి వెంకట రామ సూర్యనారాయణ తెలిపారు. సోమవారం పెనుగొండలో విలేకరులతో మాట్లాడుతూ భీమవరం, ఏలూరు, పెదవేగిల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరచడంతో వీరిని ఎంపిక చేశారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు తాడి నాగిరెడ్డి, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్, పీడీ బి.దుర్గారావు, కడలి వెంకట రమణమూర్తి, ఎం. సుగుణాకర్ అభినందించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మొగల్తూరు: అధిక వర్షాల కారణంగా తెగుళ్ళు ఆశించే అవకాశం ఉన్నందున సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి అబ్దుల్ రహమ్ సూచించారు. సోమవారం రామన్నపాలెం–2 సచివాలయ పరిధిలోని వ్యవసాయ భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ వరి పంటపై పాముపొడ తెగులు వ్యాపిస్తే హెక్సాకానజోల్ 2 మిల్లీ లీటర్లు, వాలిడామైసిన్ 1 మిల్లీ లీటర్, ప్రొపికోనజోల్ 0.4 మిల్లీ లీటర్ మందును లీటర్ నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు.